లక్ష్మీనరసింహుడికి సుప్రభాత సేవోత్సవం

యాదగిరిగుట్ట, మార్చి19: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారికి సుప్రభాత సేవోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా సాగింది. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభు ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయం, క్యూ కాంప్లెక్స్, శివాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ ఘనంగా జరిపించారు. హనుమంతుడిని సింధూరంతో అలంకరించి అభిషేకించారు. తమలపాకులతో అర్చన చేపట్టారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన వడపప్పు, బెల్లం, అరటి పండ్లను నైవేద్యంగా సమర్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. --- ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

వంటపాత్రల బహూకరణ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారి ఆరగింపు ప్రసాదం తయారీకి వినియోగించే వంటపాత్రలను కరీంనగర్‌కు చెందిన కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు బహూకరించారు. రూ.2 లక్షల విలువైన పాత్రలను మంగళవారం ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, డీఈఓ దోర్బల భాస్కర్‌శర్మకు అందించారు.

ఆలయ అనువంశికధర్మకర్తకు వంటపాత్రలు అందిస్తున్న దాత వెంకటేశ్వర్‌రెడ్డి

నేటి నుంచి రేణుకాచార్య జయంత్యోత్సవాలు

ఆలేరురూరల్,మార్చి19: కొలనుపాక సోమేశ్వరాలయంలో బుధవారం నుంచి రేణుకాచార్య జయంత్యోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధ, గురు వారాల్లో రుద్రాభిషేకం, మహా మంగళహారతి, మంత్రపుష్పం, శుక్రవారం మహారుద్రాభిషేకం, రేణుకాచార్యుల చిత్ర పటం ఊరేగింపు, ధార్మికసభ, లక్షదీపోత్సవం, చండికాంబసమేతా సోమేశ్వరస్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నట్లు పేర్కొన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన స్వామివారి రథం

పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలి

- వ్యకాస రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

ఆత్మకూరు(ఎం): సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంతయ్య

ఆత్మకూరు(ఎం),మార్చి19 : ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల్లో కూలీలకు వసతులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకోట కాంతయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్‌కిట్లు, నీటి వసతి కల్పించడంతో పాటు 5 కిలోమీటర్ల దూరం ఉంటే రవాణా చార్జీలు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు డబుల్‌బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, భూమిలేని నిరుపేదలకు మిగులు భూములు పంచాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలన్నారు.

సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పల ముత్యాలు, వీరస్వామి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేశ్, సీపీఐ మండల కార్యదర్శి జల్లి రాములు, నాయకులు వెంకటేశ్, దయాకర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారి సదానందం

తుర్కపల్లి : మాట్లాడుతున్న జిల్లా పశువైద్యాధికారి సదానందం

తుర్కపల్లి, మార్చి19 : పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి సదానందం సూచించారు. పశుసంవర్ధకశాఖ నోవారిటీ ఆగ్రో ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మాదాపురం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పశువుల గర్భకోశ వ్యాధులుతో పాటు పలు వ్యాధులకు చికిత్స అందించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారులు కె. శ్రీనివాస్‌రావు, ఎల్. జనార్దన్, నోవారిటీస్ సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ గజేంద్ర, సీనియర్ ఇంజినీర్ సెంతాల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించకుంటే దుకాణాలు సీజ్

- మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి

బార్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

భువనగిరి అర్బన్, మార్చి 19: వ్యాపారస్తులు ఆస్తి పన్నులు చెల్లించకుంటే దుకాణాలు సీజ్ చేస్తామని మున్సిపల్ కమిషనర్ పి.రామానుజులరెడ్డి అన్నారు. పట్టణంలోని అవినాశ్ బార్ యాజమాన్యం మున్సిపాలిటీకి రూ.1.20లక్షల ఆస్తిపన్ను బకాయి పడడంతో మంగళవారం బార్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తిపన్నును సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని సూచించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ గంగాధర్

నాగినేపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ గంగాధర్

బొమ్మలరామారం, మార్చి19 : లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లుకు ఇబ్బందులు కలుగకుండా తగిన సౌకర్యాలు కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్ అధికారులను ఆదేశించారు. మండలంలోని చీకటిమామిడి, నాగినేపల్లి, బొమ్మలరామారం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ఉత్సవాల్లో పాల్గొన్న ఆలయ కమిటీ చైర్మన్ కోట మల్లారెడ్డి , సినీనటి హేమ

- సినీ నటి హేమ పూజలు

భూదాన్ పోచంపల్లి, మార్చి 19 : మండలంలోని కనుముక్కుల గ్రామంలో పద్మావతీ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం చక్ర తీర్థస్నానం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సినీనటి హేమ ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కార్యక్రమంలో జడ్పీటీసీ కోట పుష్పలత, ఆలయ చైర్మన్ కోట మల్లారెడ్డి, నాయకులు కోట అభిలాశ్‌రెడ్డి, శ్రీజ, గొట్టం వెంకట్రాంరెడ్డి, బాంధవీరెడ్డి, సివిల్ సప్లై డీఎస్ఓ శ్రీనివాస్, భోగ చంద్రశేఖర్, మంగళపల్లి రాజారమేశ్, రంగ మధు, కోట సత్తిరెడ్డి, పాక నరసింహ, మట్టిపల్లి ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

పోచంపల్లికి సబర్బన్ బస్సులు నడిపించాలి

- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ప్రభాకర్‌కు గ్రామస్తుల వినతి

రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 19 : దిల్‌షుక్‌నగర్ నుంచి భూదాన్ పోచంపల్లి వరకు సబర్బన్ బస్సులు నడిపించాలని కోరుతూ గ్రామ నాయకులు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో మంత్రిని కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాయకుడు సీత సుధాకర్ మాట్లాడుతూ భూదాన్ పోచంపల్లికి వచ్చే పర్యాటకులు, హైదరాబాదుకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారి సౌకర్యార్థం బస్సులు నడిపించాలని కోరారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి : ఎంపీపీ సుధాకర్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సుధాకర్‌గౌడ్

బీబీనగర్, మార్చి 19 : గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్‌లో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండల కేంద్రంలోని లెప్రసీ కాలనీలో అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ గోలి నరేందర్‌రెడ్డి, చిన్నరావులపల్లి ఇందిరమ్మ కాలనీలో రోడ్డు సమస్యను పరిష్కరించాలని ఎంపీటీసీ గోరుకంటి బాలచందర్ కోరారు. సమావేశంలో తాసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంట సాగుకు ముందే భూసార పరీక్షలు చేయించాలి

యాదగిరిగుట్ట, మార్చి19: రైతులు విత్తనాలు విత్తే ముందు భూసార పరీక్షలు చేయించాలని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త మధుబాబు అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామంలో అజీవా రైతు ఉత్పత్తిదారుల మహిళా సంఘం సభ్యులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాబార్డు సౌజన్యంతో 10 రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లోని 500 మందికి మేలైన యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల అవశ్యకత, భూసార సంరక్షణ, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మార్కెట్‌లో అనుసంధానం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 40 నిమిషాలో ప్రధాన పోషకాలతో పాటు 11 సూక్ష్మధాతుల లభ్యతను పరీక్షించే భూసార యంత్రాన్ని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి వినయ్‌కుమార్ అవిష్కరించి అజీవా ఎఫ్‌పీఓకు అందించారు. కార్యక్రమంలో ఐఐఆర్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ మంగల్‌దీప్ టూటీ, డాక్టర్ చైతన్య, పీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ నిమ్మయ్య, అజీవ డైరక్టర్లు అరుణ, స్వరూప, మౌనిక, అనూరాధ, రైతులు పాల్గొన్నారు.

మహబూబ్‌పేటలో వైద్య శిబిరం

మందులు పంపిణీ చేస్తున్న వైద్యులు

యాదగిరిగుట్ట, మార్చి19: మండలంలోని మహబూబ్‌పేట గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి నారాయణ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ శిరీషా, డాక్టర్ రఘువీర్‌రెడ్డి 50 మంది మహిళలు, వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆరె స్వరూపామల్లేశ్‌గౌడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపుల తనిఖీ

మోత్కూరు, మార్చి 19 : జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సెగ్గం సైదులు మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని నాలుగు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలోని మద్యం నిల్వలను పరిశీలిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. ఆయన వెంట సీఐ కాయితీ రవిచంద్రారెడ్డి, ఎస్ఐ క్రాంతి, సిబ్బంది కృష్ణ పాల్గొన్నారు.

మోత్కూరులోని మద్యం దుకాణంలో తనిఖీలు చేపడుతున్న అధికారులు

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

మల్లు స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి అర్బన్, మార్చి 19: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ. జహంగీర్ పిలుపునిచ్చారు. మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ దేశ చరిత్రను వక్రీకరించి కాషాయం ముసుగులో దేశాన్ని కార్పొరేట్ శక్తులకు తాకట్టు పెడుతున్నదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించి దేశ సమైక్యతను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ, సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, మాయ కృష్ణ, గడ్డం వెంకటేశ్, వనం రాజు, వడ్డెబోయిన వెంకటేశ్ పాల్గొన్నారు.

ఘన నివాళి

చౌటుప్పల్ : పట్టణ కేంద్రంలోని కందాల రంగారెడ్డి స్మారక భవనంలో మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, ఎండీ పాషా, గంగాదేవి సైదులు, బండారు నర్సింహ, కొండె శ్రీశైలం, ఆది మూలం నందీశ్వర్, కొంతం శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల దాసు, బాతరాజు దశరథ, శేఖర్ పాల్గొన్నారు.

మోత్కూరు : మున్సిపాలిటీ కేంద్రంలోని సుందరయ్య కాలనీలో మల్లు స్వరాజ్యం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు రాచకొండ రాములమ్మ, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, నాయకులు బుర్రు అనిల్, ప్రభాకర్, చంద్రయ్య, లక్ష్మి, అలివేలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

కొలనుపాకలో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి

ఆలేరురూరల్, మార్చి19 : గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి అన్నారు. మంగళవారం మండలంలోని కొలనుపాక అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యలక్ష్మి పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గంగుల రమ, మనోరమ, అరుణ, వహీద, రేణుక పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలి

- ఎంపీపీ రమేశ్‌రాజ్

మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేశ్‌రాజ్

వలిగొండ, మార్చి19: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ నూతి రమేశ్‌రాజ్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి వనరులను వినియోగంలోకి తెచ్చి నీటి ఇబ్బందులు తీర్చాలన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాతరాజు ఉమా బాలనర్సింహ, తాసీల్దార్ పి. శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ జితేందర్‌రెడ్డి, ఎంపీఓ కేదారీశ్వర్, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కూరెళ్ల ఆలయ కమిటీ ఎన్నిక

కొత్తగా ఎన్నికైన ఆలయ కమిటీ కార్యవర్గం

ఆత్మకూరు(ఎం),మార్చి19 : మండలంలోని కూరెళ్ల ఆలయ కొత్త కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా మోతె సోమిరెడ్డి, అధ్యక్షుడిగా గుండా బాలాజీ, ఉపాధ్యక్షుడిగా మోతె యాదిరెడ్డి, ప్రధానకార్యదర్శిగా సిద్ది విజయ్‌కుమార్, సలహాదారులుగా బాషబోయిన ఉప్పలయ్య, పాపయ్య, రాములు, రామకృష్ణ, పలువురు సభ్యులను ఎన్నుకున్నారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ



కూరెళ్ల లక్ష్మి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, మార్చి 19 : తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు పలు కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. మోత్కూరుకు చెందిన కూరెళ్ల లక్ష్మి, బుజిలాపురం, దాచారానికి చెందిన నేపూరి మహిపాల్‌రెడ్డి, కామిల్ల వెంకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పైళ్ల సోమిరెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, కారుపోతుల వెంకన్న, మల్లయ్య, వీరేశం, భిక్షం, సమీర్, నగేశ్, మందుల సురేశ్ ఉన్నారు.

కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలి

ర్యాలీగా వెళ్తున్న డివీస్ పరిశ్రమ ఉద్యోగులు

చౌటుప్పల్, మార్చి19 : కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలని అధికారులు సూచించారు. 53వ జాతీయ భద్రతా దినోత్సవం సందర్భంగా మంగళవారం చౌటుప్పల్‌లోని 65వ జాతీయ రహదారిపై డివీస్ పరిశ్రమ ఉద్యోగులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సేఫ్టీ నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు ఇద్దయ్య, జానయ్య, డివీస్ ప్రతినిధులు వల్లూరి వెంకటరాజు, సీహెచ్ వీరయ్య, మహేశ్, రంగారావు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

చౌటుప్పల్, మార్చి 19 : బాలాజీ రామకృష్ణ దేవాలయంలో పద్మావతి, అలివేలుమంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, నవగ్రహపూజ, ఎదుర్కోళ్లు, స్వామి వారి కల్యాణోత్సవం, స్వామి వారి రథోత్సవం, మంత్రపుష్పం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వేన్‌రెడ్డి రాజు, ఆలయ అధ్యక్షుడు సుర్కంటి మహేందర్‌రెడ్డి, పాశం సంజయ్‌బాబు, సుర్కంటి కనకారెడ్డి పాల్గొన్నారు.